క్లుప్తంగా

ఆయుష్మాన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి



ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేస్తున్న 36వ వార్డు కౌన్సిలర్ నాగిని రవి సింగారెడ్డి

నంద్యాల(సిటీ): ఆయుష్మాన్ భారత్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని 36వ వార్డు కౌన్సిలర్, ఎమ్మెల్యే సతీమణి నాగిని రవిసింగా రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక 36వ వార్డు సచివాలయం వద్ద ఆర్థికంగా వెనుకబడిన 72 మందికి అభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్)కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డులను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు 5కే రన్

నంద్యాల టౌన్: జిల్లా ఎయిడ్స్ నివారణ–నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు అక్టోబర్ 1వ తేదీన 5కే రన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యఆరోగ్య అధికారి డాక్టర్ వెంకట రమణ, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ శారదాబాయ్ ఒక ప్రకటనలో తెలిపా రు. 17–25 మధ్య వయస్సు విద్యార్థులు, యువకులు ఈ 5కే రన్‌లో పాల్గొనవచ్చన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.7 వేలు, మూడవ బహుమతి రూ.5 వేలు, కన్సాలీడేషన్ బహుమతి కింద రూ.వెయ్యి చొప్పున ఏడుగురికి ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

గోస్పాడు: ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ గోస్పాడు మండల ప్రధాన కార్యదర్శి సికిందర్ ఆజాద్ కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు సుబ్బారాయుడు నాయక్, విజయరావు, సురేష్, రాజశేఖర్ రెడ్డి శ్రీనివాసులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై అక్రమ కేసు తొలగించాలి

నంద్యాల(వ్యవసాయం):నంద్యాల బార్ అసోసియేషన్ న్యాయవాది అశోక్ నాయక్‌పై బేతంచెర్ల పోలీసులు పెట్టిన అక్రమ కేసును తొలగించాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు విజయ్ శేఖర్ రెడ్డి, రఘుప్రకాశ్ లు పేర్కొన్నారు. శుక్రవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. తన పొలం విషయంలో హక్కుల గురించి అడిగితే తప్పుడు కేసులు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో బార్‌అసోసియేషన్ నాయకులు చంద్రమౌళి, ప్రసాదరావు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని విలీనం చేసిన ఘనత సీఎందే



మాట్లాడుతున్న ఆర్టీసీ బోర్డ్ డైరెక్టర్ రాజారెడ్డి

నంద్యాల టౌన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఆర్టీసీ బోర్డ్ డైరెక్టర్ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాల ఆర్టీసీ డిపోలో జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని డిపోల మేనేజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 51,488 మంది ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చిన సీఎంకు ఈ సందర్భంగా కతజ్ఞతలు తెలిపారు. జీపీఎస్ పెన్షన్ విధానంతో ఉద్యోగి పదవి విరమణ చేసిన తర్వాత 20 వేల నుండి 50 వేల వరకు పెన్షన్ పొందే అవకాశం ఉంటుందన్నారు. 2016 నుంచి 2019 వరకు పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టి వేల కుటుంబాలను ఆదుకున్నారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను కుటుంబ సభ్యులుగా పరిగణించి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్, ఎంప్లాయిస్ యూనియన్‌లకు గుర్తింపు కల్పించారన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి నెల సమావేశాలు ఏర్పాటు చేసి ఉద్యోగుల ఉన్నతికి సహకరిస్తామన్నారు. ఉద్యోగులు నిబద్ధతతో పని చేస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): వీఓఏల మూడు సంవత్సరాల కాలపరిమిత సర్క్యులర్ రద్దు చేసి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వీఓఏల సంఘం జిల్లా కార్యదర్శి మిట్నాల తిరుపతయ్య, ధనలక్ష్మిలు మాట్లాడుతూ..వీఓఏలందరికీ రూ. పది లక్షల గ్రూపు ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలన్నారు. న్యాయమైన వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అక్టోబర్ ,10,11 తేదీల్లో కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సోమన్న, వెంకటరమణ, భాస్కర్, శిరోమణి, శీను, శంకరయ్య, అల్లీపీరా తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వ భరోసా

- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను విజయవంతం చేద్దాం
- మున్సిపల్ ఛైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా



సమావేశానికి హాజరైన సభ్యులు (ఇన్‌సెట్)మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా

నంద్యాల(సిటీ):పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా అజెండాలోని 14 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నిసా మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి పట్టణంలోని 8 అర్బన్‌హెల్త్ సెంటర్ల పరిధిలోని వార్డుల్లో జగనన్న వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో సుమారుగా 2.50 లక్షల మంది ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు రాష్ట్రప్రభుత్వం చేపట్టిన వినూత్నమైన కార్యక్రమం జగనన్న ఆరోగ్య సురక్ష అన్నారు. ప్రతి వార్డులో వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, హెల్త్ సెక్రటరీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి వైద్యశిబిరాలను నిర్వహించి ప్రతి ఒక్కరికీ ఉచితంగా 7రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచిత మందులను అందించనున్నారన్నారు. స్పెషలిస్టు వైద్యుల సహకారంతో దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి వాటికి సంబంధించిన చికిత్సను ఆరోగ్యశ్రీ సంబంధిత ఆసుపత్రులలో వైద్యం పొందేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఇదివరకే పట్టణంలో ఆరోగ్య సురక్షకు సంబంధించిన సర్వే మొదలైందన్నారు. అనంతరం పట్టణంలో దోమల నివారణ, రోడ్లపై పశువుల సంచారాన్ని అరికట్టడం , వీధి దీపాల ఆధునీకరణకు సంబంధించిన పలు సమస్యలను సభ దృష్టికి తీసుకు రాగా ఛైర్‌పర్సన్ వెంటనే వాటిని పరిశీలించి చర్యలు చేపట్టి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గోశాల ఏర్పాటుకు స్థలం కేటాయించి త్వరగా గోశాల నిర్మాణం పూర్తి చేయాలని కమిషనర్‌ను కోరారు. పశువులు రోడ్లపైన తిరగకుండా వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. మున్సిపల్ ఆస్తుల పరిరక్షణ అనే అంశం సభ దృష్టికి రాగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు చిత్తశుద్ధితో మున్సిపల్ ఆస్తులకు పరిరక్షణగా ఉంటూ వాటి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టారని ఛైర్‌పర్సన్ అన్నారు. అయితే ఇతరులతో చెప్పించుకోవాల్సిన అవసరం తమ పార్టీ వాళ్లకు ఉండదని కో ఆప్షన్ సభ్యురాలు శోభ, వైస్‌ఛైర్మన్ పాంశావలి అన్నారు. సమావేశంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, ఎంఈ రమణమూర్తి, ఎంహెచ్ఓ డాక్టర్ అంకిరెడ్డి, డీఈఈలు మధుకుమార్, జయభారతరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడల మండలంలో..

ఉయ్యాలవాడ: మండలంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తహసీల్దార్ రవి కుమార్ శుక్రవారం తెలిపారు. టోకెన్లు అందుకున్న వారు వైద్యశిబిరాలకు వచ్చి వైద్యులను స్పందించాలన్నారు. అక్టోబర్ 3న అల్లూరు, 4న బోడెమ్మనూరు, 5న ఇంజేడు, 7న ఆర్.జంబులదిన్నె, 10న సుద్దమల్ల, 17న హరివరం, 19న కొండుపల్లె, 21న తుడుమలదిన్నె గ్రామ సచివాలయాల్లో ఎంపీడీఓ, తహసీల్దార్‌లు రెండు టీములుగా ఏర్పడి వైద్యాధికారులతో శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.



చాగలమర్రి మండలం మల్లెవేములలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

శిరివెళ్లలో నేడు..

శిరివెళ్ల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు. స్థానిక 2వ సచివాలయ పరిధిలోని ప్రజలకు వైద్యసేవలు అందిస్తామన్నారు. 1,427 నివాసాల పరిధిలో సర్వే పూర్తయిందని, 1,240 మందికి టోకెన్లు జారీ చేశామన్నారు. ఉదయం 600 మంది, మధ్యాహ్నం మరో 640 మందికి వైద్య పరీక్షలు జరుగుతాయ న్నారు. ఈ అవకాశాన్ని ప్రజలకు సద్వినియోగ పర్చుకోవాలన్నారు.

నేడు ముత్తలూరులో.

రుద్రవరం: మండలంలో శనివారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు మొదలవుతాయని ఎంపీడీఓ మధు సూదనరెడ్డి తెలిపారు. ఆలమూరు పీహెచ్‌సీ పరిధిలోని ముత్తలూరు, అక్టోబర్ 3న నర్సాపురంలో, 4న ఎర్రగుడిదిన్నె, 5న శ్రీరంగాపురం, 7న పెద్దకంబలూరు, 10 న చిన్నకంబలూరులో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు.

నేడు ఒంటివెలగలలో..

గోస్పాడు: ఒంటివెలగల గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. పేద ప్రజలకు గ్రామీణ ప్రాంతాల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం చేయాలి

దొర్నిపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ సుబ్బారెడ్డి, వైద్యాధికారి నాగేంద్రలు సూచించారు. శుక్రవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో సర్పంచి శివరామిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబరు 5న క్రిష్టిపా డు, 10 బుర్రారెడ్డిపల్లె, 11న డబ్ల్యూగోవిందిన్నె, 12 న దొర్నిపాడు–2, 13న చాకరాజువేముల, 17న కొండాపురం, 19న గుండుపాపల గ్రామ సచివాల య పరిధిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పా రు. ఆరోగ్య సురక్ష క్యాంప్ రోజు గైనకాలజిస్టు, ఫిజి షియన్, నలుగురు వైద్యులు ఉంటారన్నారు. సచి వాలయ పరిధిలో టెంట్లు వేసి కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యంతో పాటు ఉచితంగా మందులు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ విమల, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటుకు సర్వం సిద్ధం

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ, చిత్రంలో ఎంపీ పోచా తదితరులు

నంద్యాల: జిల్లాలో ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నివేదించారు. శుక్రవారం తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా సీఎం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నిసా, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హబీబుల్లా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అత్యద్భుతమైన కార్యక్రమని, ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు అన్ని ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు విడతల్లో అన్ని మండలాలు, అర్బన్ ప్రాంతాలలోని సచివాలయాలు కవర్ అయ్యేలా 385 వైద్య శిబిరాలు నిర్వహించేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ వైద్య శిబిరాల్లో సాధారణ వైద్యులతో పాటు అన్ని విభాగాలకు చెందిన నిపుణులైన డాక్టర్లను కూడా పాల్గొనేలా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇటీవల ఈనెల 26వ తేదీన నంద్యాల మండలంలోని చాబోలు గ్రామంలో ప్రయోగాత్మకంగా నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ప్రజల నుండి విశేష అనుకూల స్పందన వచ్చిందని ఈ మేరకు మరింత ఉత్సాహంతో వైద్య శిబిరాల ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, స్టేట్ కోఆర్డినేటర్ రామనాథం, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ రూపేంద్ర నాథ్ రెడ్డి ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ వరప్రసాద్, డీసీహెచ్ఎస్ కోఆర్డినేటర్ జఫ్రుల్లా, స్పెషల్ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన అహోబిలం పీఠాధిపతి చాతుర్మాస్య దీక్ష



దీక్ష విరమించిన పీఠాధిపతి రంగరాజ యతీంద్ర మహాదేశికన్

ఆళ్లగడ్డ: లోక కల్యాణార్థం అహోబిలం మఠం పీఠాధిపతి శ్రీమాన్ శఠగోప రంగరాజ యతీంద్ర మహాదేశికన్ స్వామీజీ చేపట్టిన చాతుర్మాస్య దీక్ష శుక్రవారం ముగిసింది. ఉదయం దిగువ అహోబిలం ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఛత్ర చామర వాద్య దివిటి సహితంగా సన్నిధి వీధిలోని మఠం చేరుకున్న పీఠాధిపతి మాలోల నరసింహస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం దీక్ష విరమించిన పీఠాధిపతిని వివిధ ప్రదేశాల నుంచి వచ్చిన అర్చకులు, శిశ్యులు ఘనంగా సత్కరించారు.

అహోబిలేశుని సేవలో..

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామిని ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ పద్మ జనార్దన్‌రెడ్డి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాలను దర్శించుకుని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ మర్యాదల్లో బాగంగా స్వామి తీర్థ ప్రసాదాలతో ఆశీర్వచనాలు అందజేశారు. ఈయన వెంట ఆళ్లగడ్డ ఏడీఈ రవికాంత్‌చౌదరి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం



పడకండ్ల సుబ్రమణ్యం, జాకీర్‌హుసేన్, పున్నాశేషయ్య, పీవీ జనార్ధన్‌రెడ్డి, వై.పురుషోత్తంరెడ్డి, నరసింహా రెడ్డి, కశెట్టి నాగేశ్వర్‌రావు, బత్తుల నాగేశ్వర్‌రావు, ప్రసాద్ రెడ్డి



ప్రభాకర్ రెడ్డి, కుమార్ రెడ్డి , బుడ్డా చంద్రమోహన్ రెడ్డి

నంద్యాల/ఆళ్లగడ్డ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. 2024 ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమాయత్తం అవుతూ పార్టీ బలోపేతం దిశగా ముందుకు వెళ్తుంది. ఈ క్రమంలో నంద్యాల పట్టణాన్ని మూడు క్లస్టర్లు విభజించి నంద్యాల మున్సిపాలిటీ క్లస్టర్–1 అధ్యక్షుడిగా పడకండ్ల సుబ్రమణ్యం, నంద్యాల మున్సిపాలిటీ క్లస్టర్–2 అధ్యక్షుడిగా జాకీర్‌హుసేన్, నంద్యాల మున్సిపాలిటీ క్లస్టర్–3 అధ్యక్షుడిగా పున్నాశేషయ్యలను నియమించింది. అలాగే నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు మండలం పార్టీ అధ్యక్షుడిగా పీవీ జనార్ధన్‌రెడ్డి, నంద్యాల మండలం పార్టీ అధ్యక్షుడిగా వై.పురుషోత్తం రెడ్డిలను నియమించారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గం..

నియోజవర్గంలోని అన్ని మండాలకు నూతన కార్యవర్గాలను నియమిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆళ్లగడ్డ పట్టణ అధ్యక్షుడిగా కూలూరు నరసింహారెడ్డి, ఆళ్లగడ్డ మండలానికి కొట్టి నాగేశ్వరరావు, రుద్రవరానికి ఆర్ ప్రసాద్‌రెడ్డి, చాగలమర్రికి జి కుమార్‌రెడ్డి, దొర్నిపాడుకు బత్తుల నాగేశ్వరరావు, శిరివెళ్లకు ఇందూరు ప్రభాకర్‌రెడ్డి, ఉయ్యాలవాడ మండలానికి బుడ్డా చంద్రమోహన్ రెడ్డిలను నియమించారు.

హృదయాన్ని పదిలంగా చూసుకుందాం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల టౌన్: మంచి ఆరోగ్య అలవాట్లు పాటిస్తూ హృదయాన్ని పదిలంగా ఉంచుకుందామని డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ గుండె దినోత్సవం పురస్కరించుకొని ఐఎంఏ, ఇండస్ హార్ట్ ఇన్స్టిట్యూట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో గుండె జబ్బులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న డాక్టర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు. ఆరోగ్యవంతమైన పౌష్టికాహారం తీసుకుంటూ వైద్య నిపుణుల సూచనలు పాటించడం వల్ల గుండెపోటు బారిన పడకుండా ఉండే అవకాశం ఉందన్నారు. మద్యపానం ధూమపానం లాంటి దురలవాట్లతో గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు.

అరోగ్యమిత్ర నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల టౌన్: ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నూతన జిల్లా కమిటీని శుక్రవారం నంద్యాల పట్టణంలో ఎన్నుకున్నారు. మధుమణి హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గార్లపాటి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్‌గా మనోహర రావు, వైస్ ప్రెసిడెంట్‌గా అమీర్ బాషా, జనరల్ సెక్రెటరీగా రవికుమార్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంపత్ కుమార్, సెక్రెటరీగా మల్లికార్జునరావు, ట్రెజరీగా రాజ్యలక్ష్మిలను నూతన జిల్లా నాయకులుగా ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలోఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ శ్రీధర్,టీం లీడర్ శ్రీధర్, ఉదయ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి దేవి జ్యోతి వేడుకలు



పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్తున్న జ్యోతులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైటిపేటలో వెలసిన శ్రీచౌడేశ్వరీదేవి దేవస్థానం శ్రీ చౌడ్వేరీ దేవి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మహాలయ పౌర్ణమిని పురస్కరించుకుని జ్యోతి మహోత్సవ వేడుకలను వేడుకగా నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారు జామున చిన్న చెరువుకట్ట వద్ద నుంచి మేళతాళాలతో జలాన్ని తీసుకువచ్చి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పూలంగి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులు జ్యోతులతో పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో అమ్మవారి నామస్మరణ చేస్తూ మేళతాళాలు, ఆటపాట, విచిత్ర వేషాలతో బయటి పేటలోని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదా లు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు,చెన్నా శ్రీనివాసులు, కార్యగ్గకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని శామూన్

నంద్యాల(సెంట్రల్): విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెడతూనే సాంస్కృతిక కార్యక్రమాలు, పర్యాటక ప్రదేశాల సందర్శనకూ సమ ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. సెప్టెంబర్ 27న పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన బాల బాలికలకు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికితీయటంలో ఇటువంటి పోటీలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక–సాంస్కృతిక అధికారి సీహెచ్ఎస్.సత్యనారాయణ, సిబ్బంది, గురురాజ, గుడ్‌షెప్పర్డ్, మున్సిపల్, ఏపీటీఆర్, గెలివి, బాల అకాడమి పాఠశాలల ఛైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధే లక్ష్యం

నంద్యాల(అర్బన్): పేద మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడమే శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ లక్ష్యమని బ్యాంకు ఛైర్‌పర్సన్ నాగినిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సహకార్ బ్యాంక్‌లో శుక్రవారం 120 మంది మహిళలకు రూ.15.50 లక్షల రుణాల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుణాలు తీసుకున్న మహిళలు స్వయం సమృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్ పూర్ణిమా, మేనేజర్ హరిలీలా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న జాయింట్ కలెక్టర్

నంద్యాల(అర్బన్): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజారోగ్యాన్ని కాపాడుతున్న పారిశుద్ధ్య కార్మికులను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సన్మానించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమ నిర్వహణ అనంతరం డీపీఓ మంజులవాణి ఆధ్వర్యంలో పలు గ్రామాల పారిశుద్ధ్య కార్మికులను శాలువా, మెమెంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రాణాలు పణ్ణంగా పెట్టి పని చేశారన్నారు. వారు చేసిన సాహసాలు మరువలేనివన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, ఈఓఆర్‌డీ మహీదర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత



సిబ్బంది నుండి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తూ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం పోలీసు సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి ఎస్పీ వినతులు సమర్పించారు.

మిరప పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఉయ్యాలవాడ: మిరప సాగు చేసిన రైతులు తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని యాగంటి పల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సుధాకర్, బాలరాజులు రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని సుద్దమల్ల, ఉయ్యాలవాడ, పడిగెపాడు గ్రామాల పరిధిలో రైతులు సాగు చేసిన మిరప పొలాలను పరిశీలించి వారు మాట్లాడారు. మిరపలో తామర పురుగు, తెల్లదోమ, వైరస్ సోకాయని వీటి నివారణకు 40:30:30 శాతంతో ఎకరాకు ఫిప్రోనిల్ 5 శాతం పిచికారీ చేయాలన్నారు. రెండవ దశలో వేపనూనె 1600 పీపీఎం ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. తేమశాతం లేకుండా పంటను కాపాడుకోవాలన్నారు. అలాగే మొక్కలు చనిపోకుండా ట్రైకోడర్మి విరిడి 5 లేదా 10 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈయన వెంట మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఎంపిక పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని నూనెపల్లె మున్సిపల్ హై స్కూల్ క్రీడా మైదానంలో శుక్రవారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ నంద్యాల నియోజకవర్గ ఎంపిక పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏపీ సీఎం కప్ స్టేట్ కోఆర్డినేటర్ ఏపీ రెడ్డి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను నంద్యాల స్కూల్ గేమ్ కార్యదర్శి శివకుమార్ పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. నంద్యాల మండలం, గోస్పాడు మండలాలకు చెందిన వివిధ క్రీడాంశాలలో 400 మంది బాలురు, బాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సాల్మన్, జిల్లా ఫిజికల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి నాగరాజు, సురేష్ నాయుడు, వ్యాయామ ఉపధ్యాయులు పద్మారెడ్డి, భరత్‌రెడ్డి, నాగరాజు, వెంకట రాజేష్, ఓబులేసు, చంద్రావతి, రాణెమ్మ, శేషు, రవికుమార్, మోడల్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పరిశీలన



డ్రాగన్ ఫ్రూట్స్ పంటను పరిశీలిస్తున్న అంబుడ్స్‌మన్ సభ్యులు సురేంద్రకుమార్

ఉయ్యాలవాడ: జాతీయ ఉపాధి హామీ పథకం కింద రైతులు సాగు చేసిన పండ్ల తోటలను జిల్లా అంబుడ్స్‌మన్ సభ్యులు డాక్టర్ సురేంద్రకుమార్ శుక్రవారం పరిశీలించారు. మండల పరిధిలోని పెద్దయమ్మనూరు గ్రామంలో రైతు సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్స్, సర్వాయిపల్లె గ్రామంలో జగనన్న కాలనీలో నాటిన కొబ్బరి మొక్కలను పరిశీలించి రైతుల తో మాట్లాడారు. ఉద్యానవన పంటల సాగు కోసం ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో రైతులకు ప్రో త్సాహాన్ని కల్పిస్తూ వుందన్నారు. ఈ అవకాశాన్ని సన్న, చిన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన వారందరికీ ఉపాధిలో పని చూపించవలసిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై వుందన్నారు. దరఖాస్తు చేసిన వారందరికీ వెంటనే జాబ్‌కార్డు మంజూరు చేయాలని ఏపీఓ రవిప్రకాష్‌కు సూచించారు. ఆయన వెంట ఎంపీడీ ఓ ఉమామహేశ్వరరావు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు కనీస వేతనం అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అంబుడ్స్ పర్సన్ డాక్టర్ సురేంద్రకుమార్ అన్నారు. మండలంలోని కోటకందుకూరు గ్రామంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా సాగుచేసిన ఉద్యాన తోటలను ఆయన శుక్రవారం పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట ఏపీఓ గణేష్, ఈసీ రంగయ్యలు ఉన్నారు.